

మిర్యాలగూడ రూరల్ : గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ధర్నా చేస్తున్న బి.అన్నారం గ్రామస్తులు


# నమస్తే తెలంగాణ

## యాదాద్రి భువనగిరి

I హైదరాబాద్, ఆదివారం 19 జనవరి 2025 YADADRI BHUVANAGIRI


## బార్ అసోసియేషన్ సభ్యులకు క్రీడా పోటీలు

భువనగిరి అర్బన్, జనవరి 18 : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భువనగిరి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం భువనగిరి కోర్టు ఆవరణలో ఏర్పాటుచేసిన క్రీడా పోటీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ జయరాజు ప్రారంభించారు. క్రీడా పోటీల్లో పాల్గొంటే ఉత్సాహంగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ పాల్గొనాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



క్యారమ్స్ ఆడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

# రేషన్ కార్డుల కోసం ధర్నా

- ఆందోళనకు దిగిన బి.అన్నారం గ్రామస్తులు
- ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఇవ్వాలని డిమాండ్

మిర్యాలగూడ రూరల్, జనవరి 18 : దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ రేషన్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండలంలోని బి.అన్నారం గ్రామస్తులు ఆందోళనకు దిగారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో శనివారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్రజా పాలన సమయంలో గ్రామంలో 215 మంది రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకుంటే.. కేవలం 47 మందితో కూడిన జాబితాను ప్రభుత్వం పంపించడం అన్యాయమన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొన్న అందరికీ రేషన్ కార్డులు వచ్చే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కూడా ఇలాగే ఉంటుందా అని ప్రశ్నించారు. ఎంపీడీఓ శేషగిరి శర్మ అక్కడికి చేరుకుని ప్రస్తుతం వచ్చింది తుది జాబితా కాదని, ఇప్పటికీ దరఖాస్తు చేసుకోవచ్చుని, అర్హులందరికి ప్రభుత్వ పథకాల అందే విధంగా చూస్తామని హామీ ఇచ్చి ఆందోళన విరమింపజేశారు. ధర్నాలో వాకిటి వెంకన్న, కాతోజు వినోద్‌కుమార్, కాతోజు వినయ్ కుమార్, సింగం సత్యనారాయణ, చోగొండి నాగరాజు, అంబటి ఉమాకాంత్‌రెడ్డి, బచ్చలికూరి పెద కోటయ్య, సుమన్, అంజి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, పక్కన మాజీ ఎంపీ బడుగుల, యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి, కంచర్ల, కూసుకుంట్ల

# రైతు మహా ధర్నాను విజయవంతం చేయాలి

## ఎల్లుండి నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో భారీ నిరసన

**బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి గుంటకండ్ల హాజరు**

**రుణమాఫీ, రైతు భరోసా, రైతుబీమా అందని రైతులంతా తరలిరావాలి**

**బీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బడుగుల, రవీంద్రకుమార్, కంచర్ల**

నల్లగొండ, జనవరి 18 : రైతులను నిర్లక్ష్యం చేస్తున్న రేవంత్ సర్కారుకు రైతాంగం కష్టాలను కండ్లకు కట్టేందుకు ఈ నెల 21న నల్లగొండ జిల్లా కేంద్రంలో రైతు మహాధర్నా నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, బడుగుల లింగయ్యయాదవ్, కంచర్ల రామకృష్ణారెడ్డి తెలిపారు. రైతుల పక్షాన పోరాటానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ, రైతుభరోసా, రైతు భీమా అందని రైతులంతా పార్టీలకు అతీతంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన రైతులతో మంగళవారం క్లాక్‌టవర్ సెంటర్‌లో పెద్దఎత్తున నిరసన తెలుపనున్నట్లు చెప్పారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో వాళ్లు మాట్లాడారు. మొదట నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర కుమార్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఈ ఏడాది కాలంలో రైతు భరోసా పేరుతో ఎకరాకు రూ.15వేలు ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కోత పెట్టడం దుర్మార్గమన్నారు. ఎకరాకు రూ.7500 చొప్పున ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న మొత్తం ఎకరాకు రూ.17,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారును నిలదీసేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బాధిత రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. గత యాసంగి రైతు భరోసా ఎగ్గొట్టిన రేవంత్ సర్కార్ సన్నధాన్యానికి బోనస్ కూడా ఇవ్వలేదని విమర్శించారు. 24 గంటల విద్యుత్ అందడం లేదని, మార్కెట్‌లో యూరియా కొరత ఉందని పేర్కొన్నారు. కేసీఆర్ పదేండ్లల్లో రైతును రాజు చేయడానికి రైతు బంధు, రైతు భీమా, రుణమాఫీ, 24 గంటల ఉచిత కరెంట్, చివరి గింజ వరకూ ధాన్యం కొనుగోళ్లు వంటివి చేపట్టి అండగా నిలిస్తే.. రేవంత్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే వ్యవసాయ రంగాన్ని నాశనం చేసి అన్నదాతను కుదేలు చేసిందని మండిపడ్డారు.



నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు

### రైతుల పక్షాన బీఆర్‌ఎస్ పోరాటం

- బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్‌ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు

బీఆర్‌ఎస్ పార్టీకి అధికారం ప్రధానం కాదని పేదల పక్షంగా పని చేస్తుందని సూర్యాపేట బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ స్పష్టం చేశారు. పదేండ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ పేదల పక్షంగానే పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయటడంతోపాటు రైతు సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. ఇవ్వాల అధికారంలో ఉన్న రేవంత్ సర్కార్ రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్నందునే ప్రధాన పక్షంగా ఉన్న బీఆర్‌ఎస్ పోరాటం చేస్తున్నదన్నారు. రైతులతోపాటు అన్ని వర్గాలను మభ్య పెట్టి మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు విశ్రమించకుండా పోరాడుతామన్నారు. రైతు మహా ధర్నాకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో రైతులంతా స్వచ్ఛందంగా రావాలని కోరారు.

### బాధిత రైతులంతా మహాధర్నాకు రావాలి

**కంచర్ల రామకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు**

కాంగ్రెస్ సర్కారులో రైతు భరోసా, రైతు భీమా రానివారు, రుణమాఫీ కానివారు, 24 గంటల కరెంట్ అందని వారంతా బాధితులేనని, వారంతా స్వచ్ఛందంగా మహాధర్నాకు రావాలని బీఆర్‌ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఇది రాజకీయ సభ కాదని, మన బాధ చెప్పడానికి నిర్వహిస్తున్న సభ అని తెలిపారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరైతే కష్టాలను రేవంత్ సర్కారు కండ్లకు కట్టాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై దృష్టి పెట్టకుండా అరాచకానికి పాల్పడుతున్నదని, అందులో భాగంగానే ఇటీవల భువనగిరిలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ధ్వంసం చేసిందని తెలిపారు. ప్రతిపక్షం అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పాలే తప్ప దాడులు సరికాదన్నారు. పోలీస్, అధికార యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి కొమ్ము కాయకుండా చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, నల్లగొండ జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు కంచర్ల క్రిష్ణారెడ్డి, నిరంజన్‌వలీ, కటికం సత్తయ్య గౌడ్, తండు సైదులుగౌడ్, రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, కొండూరు సత్యనారాయణ, మారగోని గణేశ్‌గౌడ్, జమాల్ ఖాద్రి, కందుల లక్ష్మయ్య, దేప వెంకట్‌రెడ్డి, ఐతగోని యాదయ్య, లొడంగి గోవర్ధన్, మైనం శ్రీను పాల్గొన్నారు.

# సజావుగా నవోదయ ప్రవేశ పరీక్ష

**ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3487 మంది విద్యార్థుల హాజరు**

రామగిరి, జనవరి 18: జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి శనివారం నిర్వహించిన పరీక్ష ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సజావుగా ముగిసింది. ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30వరకు పరీక్ష జరిగింది. నిమిష్యం ఆలస్యమైనా అనుమతి ఉండదని అధికారులు ముందస్తుగానే ప్రకటించడంతో తల్లిదండ్రులు, బంధువులు తమ పిల్లలను తీసుకుని నిర్ణీత సమయంలోపే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. నల్లగొండలో పలు పరీక్ష కేంద్రాలను డీఈఓ భిక్షపతి, జిల్లా పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ యూసుఫ్, నవోదయ విద్యాలయ సమితి అధికారులు పరిశీలించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 27 పరీక్ష కేంద్రాల్లో 4,547 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 1,060 మంది గైర్హాజరు. నల్లగొండ జిల్లాలో 526 మంది, సూర్యాపేట జిల్లాలో 326 మంది, యాదాద్రి భువనగిరి 208 మంది హాజరు కాలేదు.



కబడ్డీలో తలపడుతున్న పోలీసులు

# పోలీస్ స్పోర్ట్స్ మీట్‌కు ఎంపిక

సూర్యాపేట టౌన్, జనవరి 18: రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ -2025ని పురస్కరించుకొని వివిధ క్రీడల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించేందుకు శనివారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మెన్ అండ్ ఉమెన్ పోలీస్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, హైజంప్, లాంగ్‌జంప్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, షార్ట్‌పుట్, ఖోఖో, బ్యాడ్మింటన్, పరుగు పందెం క్రీడల్లో జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ జనార్ధన్‌రెడ్డి, డీఈఓ అశోక్, ఏఆర్ డీఎస్పీ నరసింహాచారి, ఆర్ఐ నర్సింహ, ఆర్ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

# 20న ప్రజావాణి రద్దు

భువనగిరికలెక్టరేట్, జనవరి 18 : రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల సర్వే నేపథ్యంలో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. ప్రజలు గమనించాలని శనివారం ఒక ప్రకటనలో సూచించారు.

# నిర్బంధాల నడుమ పెన్నా ప్రజాభిప్రాయ సేకరణ



పెన్నా సిమెంట్ కర్మాగారంలో ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్న అధికారులు

దామరచర్ల/పాలకవీడు, జనవరి 18 : దామరచర్ల మండలంలోని పెన్నా సిమెంటు పరిశ్రమ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునేందుకు జిల్లా పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ నిర్బంధాల మధ్య కొనసాగింది. ఇప్పటికే పలువురు ఆందోళనలు, నిరసనలు చేపట్టడం, కోర్టులను ఆశ్రయించడం తెలిసిందే. ఈ క్రమంలో వ్యతిరేకంగా ఉన్నవారిని పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని, ఎలాంటి వ్యతిరేకతా కనిపించకుండా మ.మ. అనిపించారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. నల్లగొండ జిల్లా గణేశ్‌పాడు, సూర్యాపేట జిల్లా శూన్యంపాడు గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన పెన్నా సిమెంటు కర్మాగారాన్ని ఆదానీ సంస్థ ఇటీవల కొనుగోలు చేసింది. గతంలో పెన్నా సిమెంటు కర్మాగారం కింద 354.236 హెక్టార్లు మైనింగ్ లీజు ఉండగా, అందులో గణేశ్‌పాడులో 303,664 హెక్టార్లు, సూర్యాపేట జిల్లా శూన్యంపాడులో 50.572 హెక్టార్లలో ఉత్పత్తి సామర్థ్యాన్ని 1.5 ఎంటీపీఏ నుంచి 1.8కి పెంచుకునేందుకు రెండు జిల్లాలకు వేర్వేరుగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ప్రజాభిప్రాయ సేకరణలో పలువురు ఎన్జీఓలు, స్థానికులు మాట్లాడుతూ మైనింగ్ వల్ల సమీపంలోని మూసీ నది కాలుష్యం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాలు కల్పించాలని, తండాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. మైనింగ్ వల తమ ఇండ్లు దెబ్బతింటున్నాయని, సరైన రక్షణ చర్యలతో మైనింగ్ చేయాలని డిమాండ్ చేశారు. భూములు కోల్పోయిన రైతులకు బహిరంగ మార్కెట్ కంటే అదనపు ధరను చెల్లించాలని కోరారు.

గతంలో పెన్నా సిమెంటు కర్మాగారం యాజమాన్యం అనేక హామీలు ఇచ్చి పట్టించుకోలేదని, పరిసర గ్రామాల ప్రజలు కాలుష్యం కారణంగా అనారోగ్యం పాలయ్యారని, పంటలు నష్టపోయామని వాపోయారు. అలాంటి పద్ధతులు అవలంబిస్తే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. దామరచర్ల మండలంలోని గణేశ్‌పాడులో మైనింగ్‌కు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో పలువురు లిఖితపూర్వకంగా, కొందరు నేరుగా అభిప్రాయాలను తెలిపినట్లు జేసీ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో వెంట నల్లగొండ జిల్లా పర్యావరణ ఈఈ విజయలక్ష్మి, సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్, సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సంగీత, హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, సీఐ చరమందరాజు ఉన్నారు.

### ముందస్తు అరెస్టులు..

ప్రజాభిప్రాయ సేకరణకు రాకుండా పోలీసులు దామరచర్ల మండలంలోని బీఆర్‌ఎస్, సీపీఎం నాయకులు, సామాజికవేత్తలను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ప్రజాభిప్రాయ సేకరణ ముగిశాక వారిని విడుదల చేసింది. బీఆర్‌ఎస్ నాయకులు సచిన్, వినోద్‌నాయక్, సేవాలాల్ జిల్లా అధ్యక్షుడు ధనావత్ ప్రకాశ్‌నాయక్, సీపీఎం నాయకులు వినోద్‌నాయక్, దయానంద్, సామాజిక వేత్త నక్కా శ్రీనును అదుపులోకి తీసుకుని ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. లగచర్ల ఘటన దృష్ట్యా ముందస్తుగా జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్‌లు వందలాది పోలీసులు దామరచర్ల నుంచి గణేశ్‌పాడు, శూన్నంపాడులో బందోబస్తు విధుల్లో ఉన్నారు.

- మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల, చిరుమర్తి హౌస్ అరెస్ట్
- బీఆర్‌ఎస్, సీపీఎం నాయకులు, సామాజికవేత్తల ముందస్తు అరెస్టులు

### సీఎస్ఆర్ నిధులు స్థానిక గ్రామాలకే ఇవ్వాలి : ఎమ్మెల్యే బీఎల్ఆర్



పెన్నా పరిశ్రమ నుంచి వచ్చే సీఎస్ఆర్ నిధులను స్థానిక మండలం లో, ప్రభావిత గ్రామాలకే ఇవ్వాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. ఆ మంత్రి చెప్పిండు.. ఆ నాయకులు చెప్పారంటూ అని ఇతర ప్రాంతాలకు తరలిస్తే ఊరుకునేది లేదన్నారు. కర్మాగారంలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తున్నట్లు తెలిసిందని, ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలని సూచించారు.

### కోర్టు చెప్పినా నిర్బంధించారు



పెన్నా సిమెంటు ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనకుండా పోలీసులు నన్ను ముందే అరెస్ట్ చేసి పాలకవీడు స్టేషన్‌కు తరలించారు. సమావేశం పూర్తి అయిన తర్వాత వదిలేశారు. ఇది అన్యాయం. పరిశ్రమ వెదజల్లుతున్న కాలుష్యం వల్ల పంటలు నష్టపోతున్నాం. రోగాల పాలవుతున్నాం. స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదు. మాకు నష్టం చేస్తున్న ఈ పరిశ్రమకు మైనింగ్ లీజు నిలిపివేయాలంటూ హైకోర్టుకు కూడా వెళ్లాం. ప్రజాభిప్రాయ సేకరణ చేసుకోవచ్చుని, కానీ పిటిషనర్ చేస్తున్న అభియోగాలను నివృత్తి చేయాలని కోర్టు చెప్పినా.. నన్ను ముందుగానే అరెస్ట్ చేయడం బాధాకరం.

**నక్కా శ్రీను, శూన్యంపాడు సామాజికవేత్త**

### గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు



గతంలో పెన్నా సిమెంటు మా తండాకు ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదు. ఆ కర్మాగారం కింద మా భూమి పోయింది. అయినా మాకు ఉద్యోగం ఇవ్వలేదు. గణేశ్‌పాడు నుంచి శూన్యంపాడు వెళ్లే రహదారికి ఇరువైపులా మైనింగ్ ఏర్పాటు చేస్తే మాకు ఇబ్బంది అవుతుంది.

**- లక్ష్మణ్‌నాయక్.. గణేశ్‌పాడు**

# మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల, చిరుమర్తి హౌస్ అరెస్టు

నీలగిరి/నార్కెట్‌పల్లి : దామరచర్ల మండలంలో పెన్నా సిమెంట్‌పై చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటారనే నెపంతో నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను శనివారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. నల్లగొండ టూటౌన్ ఎస్ఐ రావుల నాగరాజు అధ్వర్యంలో కంచర్లను గృహ నిర్బంధం చేశారు. ఉదయం నుంచే ఆయన ఇంటి వద్ద పెద్దఎత్తున పోలీసు బలగాలు మోహరించాయి. మాజీ ఎమ్మెల్యే కంచర్ల వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మెరుగు గోపి ఉన్నారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను నార్కట్‌పల్లిలోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

ఈ సందర్భంగా మీడియాతో చిరుమర్తి మాట్లాడుతూ ప్రభుత్వ నిర్బంధ కాండను దునుమాడారు. అరెస్టులతో ప్రశ్నించే గొంతుకను నొక్కలేరని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమంగా పెడుతున్న కేసులకు భయపడేది లేదని, వాతావరణాన్ని నాశనం చేసే పరిశ్రమలను పెట్టనివ్వబోమని తెలిపారు.



మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను హౌస్ అరెస్ట్ చేస్తున్న పోలీసులు



నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు